

పర్యాటకులకు అనుమతుల్లేవ్ : సబ్‌కలెక్టరు

ఏజెన్సీలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు నిలిపివేసినట్టు రంపచోడవరం సబ్ కలెక్టరు కల్పశ్రీ తెలిపారు. ఎవరైనా వస్తే తిరిగి వెనక్కి పంపించాలని అధికారులను ఆదేశించారు. అయితే అటవీశాఖాధికారులు మాత్రం టిక్కెట్లు విక్రయించి మరీ పర్యాటకులను జలపాతాల వద్దకు అనుమతించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి పరిస్థితుల పట్ల అవగాహన లేక పర్యాటకులు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు.

వీళ్లు గల్లంతు


సౌమ్య


అమృత


హరదీప్


చికిత్సపొందుతున్న హరిణి


కన్నీటివాగు : ఒక్కసారి ఉధృతంగా మారి ఐదుగురిని ముంచేసిన జలతరంగిణి వాగు ఇదే..

విషాదయాత్ర

ఎప్పుడూ చదువేనా.. కాస్త మార్పు కావాలనిపించింది.. పచ్చని ప్రకృతి ఒడిలో రోజంతా సేదతీరితే.. మళ్లీ రీఫ్రెష్ అవుతామని అనుకున్నారు.. అనుకున్నదే తడవుగా ఏలూరు ఆశ్రంలో మెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది తూర్పు ఏజెన్సీలోని అటవీ ప్రాంతానికి వచ్చారు.. మారేడుమిల్లి జలతరంగిణి జలపాతం వద్ద ఆగారు. అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తమ స్నేహానికి జీవితంలో గుర్తుండేలా ప్రకృతి అందాలతో కలిసి ఫొటోలను దిగారు. అకస్మాత్తుగా ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షపు నీరు వరదలా మారి క్షణాల్లోనే జలపాతంలోకి రావడం గమనించలేకపోయారు. ఒక్కసారిగా వరద పెరిగి 14 మందిలో ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని మిగతా స్నేహితులు, అగ్నిమాపక సిబ్బంది కలిసి అతికష్టం మీద కాపాడారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. దీంతో వీరి విహార యాత్ర.. విషాదంగా మారింది. ఈ వ్యవహారంలో అటవీశాఖ నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇటీవల వర్షాల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు అనుమతులు రద్దు చేశారు. అయినా జలంతరంగిణి వద్ద అటవీశాఖ సిబ్బంది వీరిని అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చూస్తుండగానే ముంచేసిన జలతరంగిణి వాగు

- ఆశ్రమ్ విద్యార్థుల విహార యాత్ర
- కళ్లెదుటే ఐదుగురు గల్లంతు
- క్షణాల్లోనే ఆవిరైన ఆనందం
- ఇద్దరిని కాపాడిన వైనం
- కానరాని ముగ్గురి ఆచూకీ
- చీకటిపడడంతో ఆగిన గాలింపు
- అందరూ మెడికల్ విద్యార్థులే
- మారేడుమిల్లి వద్ద ఘటన
- రెండు రోజులుగా అనుమతుల్లేవ్

మారేడుమిల్లి/ఏలూరు క్రైం/రంపచోడవరం, సెప్టెంబరు 22: వైద్య విద్యార్థుల విహారయాత్ర విషాదంగా మిగిలింది. అప్పటిదాకా ఎంతో ఆనందం గడిపిన వారంత ఒక్కసారిగా హతాశులయ్యారు. ఎంతో ప్రశాంతంగా ఉన్న వాగు క్షణాల్లోనే ఉధృతంగా మారి తమ కళ్లెదుటే స్నేహితులను ముంచేయడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14 మంది టెంపో ట్రావెలర్‌లో శనివారం రాత్రి విహార యాత్రకు బయలుదేరారు. ఆదివారం ఉదయం నుంచి పలు ప్రాంతాలు చూసుకుంటూ మధ్యాహ్నానికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జల తరంగిణి జలపాతం వద్దకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రశాంతంగా కనిపించిన జలపాతంలోకి కొంత మంది స్నానాలకు దిగారు. కొంతమంది ఫొటోలు తీసుకుంటున్నారు. అప్పటికే వర్షం ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షం పడుతోంది. వాగులో ఎర్రరంగు నీరు వస్తున్నా స్నానం చేసేవారికి అర్థం కాలేదు. ఫొటోలు తీసేవారు బురద నీరు వస్తోందని కేకలు వేస్తున్నారు. అయినా జలపాతం శబ్దంలో స్నానాలు చేసేవారు గమనించలేకపోయారు. క్షణాల్లోనే నీరు పెరిగిపోతుండగా వెంటనే కొంతమంది తప్పించుకోగా ఐదుగురు చిక్కుకుపోయారు. వాగు ఉధృతికి ఐదుగురు విద్యార్థులు గాయత్రి పుష్ప, చింతా హరిణిప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కొట్టుకుపోయారు. వీరిలో ఒకరిని స్నేహితులు అతికష్టం మీద కాపాడగలిగారు. ఈలోపు పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే రంపచోడవరం అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. కొండలపై నుంచి వర్షపునీరు ఉధృతంగా రావడంతో మిగిలినవారి జాడ తెలియలేదు. కాసేపటికి జలపాతం దిగువన కల్వర్టు వద్ద సిమెంట్ తూరల్లో ఒకరు ఉన్నట్టు గుర్తించి అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి కాపాడారు. గాయత్రి ప్రియ, చింతా హర్షిణీలను రక్షించారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్ (20), విజయనగరం జిల్లాకు చెందిన కొసిరెడ్డి సౌమ్య (21), బాలి అమృత (22) గల్లంతయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పినట్టు సమాచారం. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయగా చీకటి పడిపోవడం.. వర్షం పడుతుండడంతో ఆటంకంగా మారాయి. రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వైద్య విద్యార్థుల కోసం తమ కళాశాల తరఫున ప్రత్యేక బృందాన్ని పంపించామని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు ఆశ్రం కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

'ఆశ్రం'లో తీవ్ర విషాదం...

గల్లంతైన వారు ఎక్కడైనా చెట్లను పట్టుకుని బతికి ఉన్నారేమో అనే ఆశతో తోటి విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. చింతపల్లి హరదీప్‌కు బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా పేరుంది. కార్డియాలజీలో ప్రత్యేక వైద్య నిపుణుడిగా పేరు పొందాలనే ఆశయం చదువుతున్నాడు. అమృత తెలివైన విద్యార్థిని.. డాక్టర్ చదివి పేదల వైద్యురాలిగా పేరు పొందాలనే ఆశయంతో ఉంది. కొసిరెడ్డి సౌమ్య మంచి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతోనే చదువు కొనసాగిస్తోంది. ముగ్గురూ కొట్టుకుపోయారని సమాచారం అందడంతో ఆశ్రం కళాశాల విద్యార్థుల్లో తీరని విషాదం నెలకొంది. ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి చెప్పారు.

యాత్రకు వెళ్లింది వీరే...

గల్లంతైన విద్యార్థులు : కొసిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22) (విజయనగరం జిల్లా), చింతకుంట హరదీప్ (20) (ప్రకాశం జిల్లా మార్కాపురం) **గాయపడినవారు :** దండే గాయత్రి పుష్ప (బాపట్ల), సీహెచ్ హరిణి ప్రియ (విశాఖ జిల్లా మధురవాడ), పొట్లూరి ప్రజ్ఞ (భీమిలి) **మిగిలినవారు:** హిమబిందు (బొబ్బిలి), మేఘన (కర్నూలు), స్వప్న (అనంతపురం), హరి నేత్ర (చీరాల), అవినాష్, హరిప్రియ, ధీరజ (రాజమహేంద్రవరం), జాగృతి (ద్వారకా తిరుమల)

బదిలీలే.. బదిలీలు..



- పంచాయతీరాజ్‌లో అధికారులకు స్థానచలనం
- ఉమ్మడి జిల్లా పరిధిలోని పదిమంది ఎంపీడీవోల బదిలీ
- కాకినాడ జిల్లా డీపీవో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ
- ఇక్కడకు బదిలీపై రానున్న బాపట్ల డీపీవో వి.రవికుమార్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ పరిధిలో పలువురు అధికారులను బదిలీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ పరిధిలోని పదిమంది మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల(ఎంపీడీవో)ను బదిలీ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన జిల్లాలకు ఎంపీడీవోలను వెంటనే రిలీవ్ చేయాలని తూర్పు జడ్పీ సీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీ అయిన ఎంపీడీవోల్లో కృష్ణా జిల్లాకు సీహెచ్ రవిబాబు, ఆర్.ఫణీంద్ర, పి.హరిప్రియలకు పోస్టింగ్ ఇచ్చారు. ప్రకాశం జిల్లాకు బి.శ్రీనివాసులు, శ్రీకాకుళం జిల్లాకు ఎంవీ రంగారావు, వసంతకుమార్, విశాఖపట్నం జిల్లాకు కె.అప్పారావు, ఎం.ప్రేమ్‌సాగర్, కేవీ ప్రసాద్, వైఎస్ఆర్ జిల్లాకు ఎ.వీరకిషోర్ బదిలీ అయ్యారు. వీరికి బదిలీ మార్గదర్శకాలు పాటిస్తూ ఎంపీడీవోలుగా పోస్టింగ్ ఇవ్వాలని ఆయా జిల్లాల సీఈవోలకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీపీవో బదిలీ..

జిల్లా పంచాయతీ ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జీవోనెంబర్ 536 జారీ చేశారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న కె.భారతి సౌజన్యను శ్రీకాకుళం జిల్లా డీపీవోగా బదిలీ చేశారు. బాపట్ల డీపీవో వి.రవికుమార్ కాకినాడ డీపీవోగా బదిలీపై రానున్నారు. 537 జీవో ద్వారా జడ్పీ సీఈవోలు, డీఎల్‌డీవోలను బదిలీ చేశారు. కాకినాడ డీఎల్‌డీవోగా పనిచేస్తున్న పి.నారాయణమూర్తిని విశాఖపట్నం జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. జీవో నెంబర్ 538 ద్వారా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల బదిలీ చేపట్టారు. కాకినాడ పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ శ్రీనివాస్‌కు పదోన్నతి కల్పించారు. కృష్ణా జిల్లా డ్వామా ఏవోగా పనిచేసిన ఎ.నాగమహేశ్వరరావు కాకినాడ జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీపై రానున్నారు.

వచ్చే నెలలోనూ కందిపప్పు..

లేనట్లే..



- రేషన్‌లో బియ్యం, పంచదారకే పరిమితం
- టెండర్లు ఖరారు కాకపోవడంతో సరఫరా లేదు
- దసరా పండుగకు మొండిచేయి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 22: వచ్చేనెల అక్టోబరులో కూడా రేషన్‌లో కందిపప్పు అందించే పరిస్థితి లేదు. టెండర్లు ఖరారు కాకపోవడంతో జిల్లాకు కందిపప్పు సరఫరా అవ్వడం లేదు. దీంతో కేవలం బియ్యం, పంచదార మాత్రమే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేయనున్నారు. ఆగస్టు నుంచే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు సబ్సిడీపై కందిపప్పు అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. పౌరసరఫరాలశాఖ అధికారుల అలసత్వంతో ఈ పంపిణీ వాయిదా పడుతోంది. మూడునెలలుగా అధికారులు ఊరిస్తూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తరహాలోనే అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ ఇస్తామని గొప్పలు చెప్పి చివరికి రేషన్‌సరుకుల్లో కోతలు పెట్టుకుంటూ వచ్చి చివరికి బియ్యం పంపిణీకి పరిమితమయ్యారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కందిపప్పు సబ్సిడీపై అందించాలని ఆదేశించింది. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.150 ఉంటే సబ్సిడీపై రూ.67కే ఇవ్వాలని ఆదేశించింది. అయినా ఫలితం దక్కలేదు.

దసరా పండుగకు మొండిచేయి

వచ్చేనెలలో దసరా పండుగ చేసుకునేందుకు సిద్ధమవుతున్న లబ్ధిదారులకు కందిపప్పు విషయంలో మొండిచేయి చూపిస్తున్నారు. పండుగలో పప్పు అన్నం తిందామన్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. ఆగస్టు నుంచి అక్టోబరు వరకు మూడు నెలలకు సరిపోయేలా కందిపప్పు సేకరించాలని పౌరసరఫరాల సంస్థ ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా గత జూలైనెలలో టెండర్లను ఆహ్వానించింది. టెండర్ విలువ రూ.100కోట్లు దాటడంతో న్యాయ సమీక్షకు వెళ్లాల్సి ఉండడంతో పౌరసరఫరాలశాఖ అధికారులు దీన్ని జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపించారు. ఇందులో జాప్యం నేపథ్యంలో టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో కందిపప్పు సరఫరాకు అవకాశం లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలు చేయడానికి జనం బెంబేలెత్తుతున్నారు. దీనిపై సివిల్ సప్లయిస్ డీఎం బాలసరస్వతిని వివరణ కోరగా వచ్చేనెలలో జిల్లాలో 9414 మెట్రిక్‌టన్నుల బియ్యం, 276 మెట్రిక్‌టన్నుల పంచదార పంపిణీ సిద్ధం చేశామన్నారు. కందిపప్పు సరఫరా కాలేదన్నారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగాస్వామ్యం కావాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 22: స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్రా-2047 విజన్‌కు శ్రీకారం చుట్టిందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఆర్థిక, సామాజికాభివృద్ధి, పర్యావరణ సుస్థిరతలపై దృష్టిసారిస్తూ 2047 నాటికి దేశానికి రాష్ట్రాన్ని ప్రధాన వృద్ధి కేంద్రంగా మార్చడానికి కావాల్సిన కార్యాచరణ ప్రణాళిక నిర్దేశించిందన్నారు. విజన్‌సభల్లో పాల్గొని క్యూఆర్‌కోడ్ స్కేన్ చేసి తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేయాలనిజిల్లావాసులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు సూచించారు.

డ్రాపౌట్స్ ఒత్తిడి!!

- సమీక్షల పేరుతో సమయం వృథా
- నష్టపోతున్న రెగ్యులర్ విద్యార్థులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 22: ప్రభుత్వ పాఠశాలల్లో వేలాదిగా ఉన్న విద్యార్థుల భవిష్యత్ బడిబయట ఉన్న వందలమంది విద్యార్థులవల్ల ప్రశ్నార్థకంగా మారుతోందా.. ప్రభుత్వ విద్యకు సంబంధించి మొత్తం యంత్రాంగం అంటే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డీవైఈవో, ఎంఈవోలు ఇతర సిబ్బంది డ్రాపౌట్ల చుట్టూ తిరుగుతూ రెగ్యులర్ విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తున్నారా అంటే నిజమేననిపిస్తోంది.

90శాతం మంది విద్యాసంస్థల్లోనే..

కాకినాడ జిల్లాలో మొత్తం 29,946 మంది 6 నుంచి 18ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులు బడిబయట ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వారిలో 1 నుంచి 9వ తరగతి చదవాల్సిన విద్యార్థులు 4,890మంది, 10వతరగతి పూర్తిచేసినవారు 4,287మంది, ఇంటర్ ఆపైన ఉన్న విద్యార్థులు 20,769 ఉన్నట్లు సమాచారం. నిజానికి వారంతా విద్యకు దూరంగా ఉన్నారా బడిబయటే ఉన్నారా అని వివరాలు సేకరిస్తే వారిలో 90శాతంమంది విద్యాసంస్థల్లోనే కొనసాగుతున్నారు. ముఖ్యంగా ఎక్కువశాతం విద్యార్థులు ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతర సాంకేతిక విద్యలను అభ్యసిస్తున్నవారే. రాష్ట్రవ్యాప్తంగాఅన్ని విద్యాసంస్థలు, అన్ని రకాల కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్ అడ్మిషన్ విధానంలో కానీ, రిజిస్ట్రేషన్ విధానంలో కానీ సమన్వయం లేకపోవడం, విద్యాసంస్థలన్నీ అనుసంధానించకపోవడం వల్ల వేల సంఖ్యలో విద్యార్థులు డ్రాపౌట్లుగా చూపుతున్నారు.


కాకినాడ విద్యాశాఖ కార్యాలయంలో డ్రాపౌట్స్‌పై శనివారం నిర్వహించిన సమీక్ష

ఫీజులు ప్రధానోపాధ్యాయులే కట్టాలట..

పాఠశాల విద్యాశాఖ డ్రాపౌట్లను నిర్ధారించిన తర్వాత పాఠశాల, మండలవారీగా డ్రాపౌట్లుగా ఉన్న విద్యార్థుల వివరాలను ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివరాలను సేకరించి డీఈవోకు సమర్పించడం.. యూడైస్ పోర్టల్‌లో నమోదుచేయడం ఇప్పటికే జరిగింది. ఈ వివరాలతో కలెక్టర్ తృప్తి చెందడం లేదని డ్రాపౌట్లను పూర్తిగా తీసివేయాలని హెచ్ఎంలు, ఎంఈవో, ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది వారు చేరిన వివిధ కళాశాలలకు స్వయంగా వెళ్లి సంబంధిత కళాశాలలో ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చేయాలని, వృత్తి విద్యనభ్యసించే విద్యార్థులైతే సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ నుంచి విద్యార్థులు చదువుతున్నట్లుగా ధ్రువపత్రం తీసుకోవాలి. 10వ తరగతి ఫెయిలైన విద్యార్థులను ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ చేయించాలని, వారికి ఫీజులు ప్రధానోపాధ్యాయులే కట్టాలనడం సరికాదని పలువురు ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెండు, మూడేళ్ల క్రితం పాఠశాలను విడిచిన వారు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినవారు, మైనార్టీ వయసులోనే వివాహాలు జరిగి దూరంగా ఉన్న డ్రాపౌట్ల విషయంలో హెచ్ఎంలను బాధ్యులుగా చేయడం ఎంతవరకూ సమంజసమని ఆవేదన చెందుతున్నారు.


ఏ జిల్లాలోనూ ఈ ఒత్తిడిలేదు

ఏపీలో ఏ జిల్లాలోనూ ఈవిధమైన ఒత్తిడిలేదని కలెక్టర్ ఆదేశాలని డీఈవో అనడంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రశాంతంగా పాఠాలు చెప్పుకునే పరిస్థితిలేదని, దీనికితోడు స్వచ్ఛతాపక్వాడా, స్వచ్ఛతాహిసేవ కార్యక్రమాల ర్యాలీల నిర్వహణతో విద్యార్థులు చదువులో వెనుకబడిపోతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్య ఎటుపోతుందో అనే భావన కనిపిస్తోంది.

● కలెక్టర్ సీరియస్

దీనిపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని సాయంత్రం 4 గంటలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రప్పించి రాత్రి 9గంటల వరకూ పనిచేసి తీరాలని ఒత్తిడి చేయడం, కనీసం మహిళలు, 50ఏళ్లు దాటిన వారని కూడా చూడకుండా పనిచేయిస్తున్నారు. ఇప్పటికే వర్షాల వల్ల కొన్నిరోజులు, ఆలోచనలేని పరీక్షల నిర్వహణవల్ల కొన్ని రోజులు విలువైన బోధనాభ్యసన సమయాన్ని కోల్పోయామని, సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

సమన్వయంతో పనిచేస్తే తగ్గించవచ్చు



విద్యా శాఖలో ఉన్నటువంటి అన్ని రకాల ఇనిస్టిట్యూట్లు సమన్వయంతో పనిచేస్తే డ్రాపౌట్స్ సమస్య తగ్గే అవకాశముంది. 10వ తరగతి, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులను డ్రాపౌట్స్‌గా పరిగణించకూడదు.

-చెవ్వూరి రవి, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి

కాకినాడ ఆర్ఎంసీ ప్రొఫెసర్‌పై దాడి ఘటనపై.. బహిరంగ సభలో ఎమ్మెల్యే నానాజీ పశ్చాత్తాపం

- నేడు ఒకరోజు ప్రాయశ్చిత దీక్ష చేస్తానని ప్రకటన


కాకినాడ రూరల్ పరిధిలోని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

దాడి ఘటనపై భగ్గుమంటున్న వైద్యసంఘాలు

- కేసు నమోదు చేయాలని డిమాండ్
- నేడు తుది కార్యాచరణ ప్రకటన
- దశలవారీ ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్న ఏపీజీడీఏ

రుణాలు పొందుతున్న బోగస్ గ్రూపులను గుర్తించాలి

- సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 22: వివిధ జిల్లా, మండలం, గ్రామ మహిళా సభ్యులతో బోగస్ గ్రూపులను సృష్టించి రుణాలు పొందుతున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీరపాండియన్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వీటిని టీపీఎమ్‌యూఎస్, ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, డీఆర్‌డీఏల ప్రాజెక్టు డైరెక్టర్లు నిశితంగా పర్యవేక్షించాలన్నారు. సొసైటీ ఫర్ దీ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీని 2000లో రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిందని, 'మీకందరికీ తెలుసు' సామాజిక సమీకరణ, జీవనోపాధిని మెరుగుపరచడం ద్వారా పేదరికం తగ్గింపును సులభతరం చేయడానికి ఇది సున్నితమైన సహాయక నిర్మాణంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. వివిధ జిల్లా, మండల, గ్రామ మహిళ సభ్యులతో బోగస్ గ్రూపులను సృష్టించి రుణాలు పొందుతున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. బ్యాంకు లింకేజీ కార్యకలాపాల్లో లోపాలు జరిగితే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాల్లో బోగస్ గ్రూపులు, నిధులు దుర్వినియోగం కేసులను గుర్తించి ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీలో ఏదైనా అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



మూడు రోజులలో 14 రైళ్లు రద్దు

సామర్లకోట, సెప్టెంబరు 22: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొవ్వూరు, గోదావరి, రాజమహేంద్రవరం, కడియం సెక్షన్‌లలో నాన్ ఇంటర్‌లాకింగ్ ప్రక్రియ, ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టమ్‌ల ఏర్పాటు నిమిత్తం రైల్వే సిబ్బంది పనులు చేపట్టనున్నందున ఈనెల 29, 30 అక్టోబరు 1లో వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే 14 రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం.మండ్రూప్‌కర్ సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు ఆది వారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సేకరించిన సమా చారం ఇలా ఉంది.

తిరుపతి-విశాఖ (22708) రైలు, గుంటూరు-విశాఖ(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఈనెల 29న రద్దు చేశారు. విశాఖ-తిరుపతి(22707) ఎక్స్‌ప్రె స్, విజయవాడ-విశాఖపట్నం (12718) ఎక్స్‌ప్రెస్, విశాఖ- విజయవాడ (12717) ఎక్స్‌ప్రెస్, విశాఖ-గుంటూరు (22701) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖ(22702) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖ (17239) ఎక్స్‌ప్రెస్, విశాఖ-గుంటూరు (17240) ఎక్స్‌ప్రెస్, విజయవాడ- రాజమహేంద్రవరం (07768) రైలు, రాజమహేంద్రవరం-విశాఖ (07466) రైలు, విశాఖ-రాజమహేంద్రవరం (07467) రైలు మొత్తం 10 రైళ్లు ఈ నెల 30న రద్దు చేశారు. విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే(17240) రైలు అక్టోబరు 1న రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సమీప రైల్వేస్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయంలో సంప్రదించాలని పీఆర్వో మండ్రూప్‌కర్ తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో
ఆహార భద్రతా అధికారులు శాంపిల్స్ సేకరణ

అన్నవరం, సెప్టెంబరు 22: అన్నవరం దేవస్థానంలో అన్నదానం, ప్రసాదం తయారీకి వినియోగించే ముడిపదార్థాలైన నెయ్యి, పప్పుదినుసులు, పంచదార తదితర పదార్థాలను ఆహార నియంత్రణ అధికారులు ఆదివారం శాంపిల్స్ సేకరించి తీసుకెళ్లారు. వీటిని తమ ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌కు పంపించి నాణ్యత పరిశీలిస్తామని ఈ నమూనాల ల్యాబ్ రిపోర్టుకు సుమారు 20 రోజుల సమయం పడుతుందని ఆహారభద్రత నియంత్రణ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పేర్కొన్నారు. ప్రాథమిక పరిశీలనలో అంతా సవ్యంగానే ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నమూనాల పరీక్షలకు ఎక్కడికి పంపాలి అనేది తమ ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని అన్నారు.

సత్యదేవుడికి వేడుకగా రథసేవ



అన్నవరం, సెప్టెంబరు 22: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ అయిన రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను టేకు రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. పీఆర్ఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ ఐ.వి.రామారావు, సి.సి టు ఛైర్మన్ అత్తి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తింటే రోగాలే!


కుళ్లిన కోడిగుడ్లు, మసాల పెట్టి నిల్వచేసిన పాడైన చికెన్ (ఫైల్)

- బయట ఫుడ్ నో సేఫ్
- 80 శాతం అనారోగ్యాలకు అదే కారణం
- హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత తనిఖీలు పత్తాలేదు
- జిల్లా వ్యాప్తంగా పైసా వసూళ్లు ● కానరాని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు22: నేటి ఆధునిక యుగంలో అందరూ క్షణం తీరిక లేకుండా రోజులు గడిపేస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో వండుకుని తినే పరిస్థితులు లేక నూటికి 60శాతం మంది బయటే ఆహారం తీసుకుంటున్నారు. ఇది వారి ఆరోగ్యానికి సేఫ్‌కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బయట ఆహారం అనారోగ్యకరమని అనేక సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. కొంత మంది ఉద్యోగాలు, వృత్తుల రీత్యా ఇంట్లో వండిన భోజనాలు తినే పరిస్థితిలేక బయట హోటల్స్, రెస్టారెంట్లను ఆశ్రయిస్తుంటారు. కొన్ని హోటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను పరిశీలిస్తే అనేక దారుణ విషయాలు బయటకు వస్తున్నాయి. పాడైన మటన్, చికెన్, చేపలు, గుడ్లు వంటి వాటిని ఫ్రిజ్‌లలో నిల్వలు చేసి వాటిని డ్రైచేసి మసాలా బాగా దట్టించి కూరలలో వినియోగించి వినియోగదారులకు అందిస్తున్నారు. వాటివల్ల అనేక రోగాలబారినపడే ప్రమాదం ఉంది. వినియోగించే వంట నూనెలను వారాల తరబడి వాడిందే వాడుతున్నారు. దీనివల్ల అందులో ఉడికిన పదార్థాలుఅనారోగ్య కారకాలుగా మారతాయి.

తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించాలి

● గొట్టిముక్కల అనంతరావు, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు



ఆహార తయారీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టల్స్‌లో కూడా ఆహార తనిఖీలు చేపట్టాలి. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు కొన్ని రెస్టారెంట్లను తనిఖీ చేసి కేసులు కూడా పెట్టించాం. డీసీపీసీ సమావేశంలో కూడా జిల్లా కలెక్టర్‌ను ఆహార తనిఖీలకు చర్యలు తీసుకోవాలని కోరాం. సిబ్బంది కొరత అని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. తనిఖీల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్సును నియమించాలి. రాజమహేంద్రవరంలో రెస్టారెంట్లపై అనేక ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి.

నాణ్యతలేని ఆహారంవల్ల వచ్చే వ్యాధులు

బయట నాణ్యతలేని ఆహారం తీసుకోవడం శరీరంలో బ్యాక్టీరియా పెరుగుతోంది. కడుపునొప్పి, వాంతులు విరోచనాలు, అతిసార వ్యాధి, అధిక రక్తపోటు, గుండెపోటు, అజీర్ణం, గ్యాస్ నొప్పులు, టైఫాయిడ్, దద్దుర్లు, శ్వాస సమస్యలు, కండరాలవాపు, రక్తనాళాల సమస్యలు, ఇన్సులిన్ నిరోధకత, టైప్2 మధుమేహంవంటి జబ్బులబారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

80 అనారోగ్య సమస్యలు

సహజంగా ప్రకృతి సిద్ధమైన ఆహారం తాజా కూరగాయలు, నాణ్యతతో కూడిన పండ్లు, ఆహార పానీయాలు అప్పటికప్పుడు తయారుచేసి తీసుకోవడంవల్లన మనిషి ఆరోగ్యంగా జీవనం సాగిస్తుంటాడు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కంగారుగా హోటల్‌కి పోవడం నచ్చింది ఆర్డర్ చేసేయ్యడం, వచ్చిన వెంటనే భుజించడం ఇది ఇప్పటి ట్రెండ్, బాగా రోస్ట్ చేయించుకుని నచ్చిన రెసిపీలో తినేయడమే దానివెనుక దాగివున్న ప్రమాదాలు ప్రస్తుత యువతరానికి కనిపించడం లేదు. వేడివేడి కూరలు కవర్ ప్యాకింగ్ చేస్తే ఆ ప్లాస్టిక్ వాటిలో కరిగితే అది తింటే ఏమౌతుందో అనే భయం కూడా లేని పరిస్థితి. ఒంట్లో సమస్యలు వచ్చి అది రోగాలకు దారి తీసినప్పుడు మాత్రం అప్పుడు దాని కోసం ఆలోచించే పరిస్థితులు ప్రస్తుత సమాజంలో కనిపిస్తున్నాయి. మందు, గుట్కా, సిగరెట్ వంటి మాదక ద్రవ్యాలు తీసుకుంటేనే క్యాన్సర్ బారిన పడినట్లు కాదు. ఈవేమీ తీసుకోకుండానే కొన్నిరకాల నాణ్యతలేని ఆహారం తీసుకోవడంవల్ల కూడా క్యాన్సర్, లివర్, జీర్ణాశయం వ్యాధుల బారిన పడతారంటే అతిశయోక్తికాదు. ఇలా నాణ్యతలేని ఆహారం భుజించడం ద్వారా 80 శాతం అనారోగ్య సమస్యలు వస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


హోటల్ కిచెన్‌లో గోదుమ రంగులోకి మారిన ఆయిల్ (ఫైల్)

హోటల్స్, రెస్టారెంట్లలో నామమాత్రపు తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా కొన్నివేల హోటల్స్, రెస్టారెంట్లు, చిన్నాచితకా దాబాలు, ఫుడ్ కోర్టులు ద్వారా లక్షలాది మంది ప్రజలు ఆహారం తీసుకుంటున్నారు. వారికి నచ్చిన ఫుడ్‌ను ఆర్డర్ చేసుకుని మరీ తింటున్నారు. కొన్ని హోటల్స్ రెస్టారెంట్లలో కిచెన్‌లో పరిస్థితి వచ్చిన కస్టమర్‌కు తెలియదు, బయట హడావిడిగా షోయింగ్ పడిపోతాడు. లోపల ఫ్రిజర్‌లో ఎలాంటి ఆహారం నిల్వవుంది. వాటి నాణ్యత ఎలావుంది, వంట తయారీకి ఎటువంటి ఆయిల్ వినియోగిస్తున్నారు అనేది వినియోగదారుడికి తెలియదు, లోపలకి వెళ్లి చూసే పరిస్థితి కూడా ఉండదు. దీంతో లాభాపేక్షతో కొందరు రెస్టారెంట్, ఫుడ్ కోర్టుల నిర్వాహకులు ఆహార నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి ప్రజల ఆరోగ్యాలతో ఆటాడుకుంటున్నారు. కనీసం నెలనెలా రెస్టారెంట్లను, హోటల్స్‌ను, ఫుడ్‌కోర్టులను సంబంధిత అధికారులు తనిఖీలు చేసే పరిస్థితులు కూడా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా మారిపోయింది. ఇటీవల విజిలెన్స్ ఎస్పీ నేరుగా తనిఖీలు చేసిన పరిస్థితి కూడా చూశాం. విజిలెన్స్ తనిఖీ తర్వాత నగరపాలక సంస్థ 3 బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలపై దృష్టిపెట్టింది. కొన్నిచోట్ల ఉన్న రెస్టారెంట్లు, హోటల్స్‌లో తాజా నూనెలు వినియోగించడం లేదు. నూనెలో యాడిటివ్స్, ప్రిజర్వేటివ్స్, కలుషితాలతో ఉండకూడదు. నూనెలో టోటల్ పోలర్ మెటీరియల్ శాతం 25 మాత్రమే ఉండాలి. కానీ రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి లాంటి ప్రాంతాల్లోని కొన్ని హోటల్స్‌లో 60 నుంచి 70 శాతం ఉంటుంది. దీనిలో ఉడికించిన ఆహార పదార్థాలు స్వీకరిస్తే క్యాన్సర్ వస్తోంది. నూనెలు వింతవాసన వచ్చిన, గోదుమ రంగుల్లోకి వచ్చిన వాటిని వినియోగించరాదు. దాదాపు అన్నిచోట్ల నూనెలను దారుణంగా నలుపురంగు వచ్చేవరకు వాడుతున్నారు. తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగడంలేదు. ఏదొక సీజన్‌లో తనిఖీలుచేసి అటుపై మొద్దునిద్రలో సంబంధిత అధికారులు ఉంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యం వెనుక కారణాలేమిటో?

జిల్లాలో 19 మండలాలు ఉన్నాయి. వాటిలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ కాగా, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలుగా ఉన్నాయి. మిగిలిన ప్రాంతాలు నగర పంచాయతీలు, గ్రామ పంచాతీలుగా ఉన్నాయి. రాజమహేంద్రవరంలో 5 స్టార్ హోటల్స్ మొదలుకొని, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, భోజనం హోటల్స్ అనేకం ఉన్నాయి. అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో కూడా హోటల్స్ ఉన్నాయి. ఆయా హోటల్స్ రెస్టారెంట్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు కనీసం పట్టించుకోవడం లేదు. దీనివెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి. మాముళ్ల మత్తులో ఉన్న కొంతమంది అధికారులు అండగా ఉండడంతో ఆహార భద్రత, నాణ్యత చట్టాలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఒకవేళ దాడులు చేసినా తీసుకున్న శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తారు కానీ వాటి రిపోర్టు రాదు, తదుపరి చర్యలు ఉండవు.

ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు లేకపోతే..


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

● కాల్ 9989688699: ఏఎఫ్‌సీ శ్రీనివాస్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్(ఏఎఫ్‌సీ) బి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆహారంలో విషయంలో నాణ్యతా ప్రమాణాలు లేవని గమనిస్తే వెంటనే జిల్లా ఆహార భద్రతా అధికారి 9849848070, తన నెంబరు 9989688699కి ఫోన్‌చేయాలని ఆయన సూచించారు. రాజమహేంద్రవరంలోని ఆదివారం పలు రెస్టారెంట్లు, ఈట్‌స్ట్రీట్‌లో తనిఖీలు నిర్వహించారు. వంటకాల్లో వినియోగించే సరుకులు, పెరుగు తదితర పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పరీక్షల నిమిత్తం పంపించామన్నారు. కొన్నింటిలో నిబంధనల ఉల్లంఘనలు గమనించి అక్కడికక్కడే జరిమానాలు విధించామన్నారు. మంజీర, షెల్టన్, శ్రీకన్య, సితార, ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేశామని శ్రీనివాస్ తెలిపారు. ఈట్‌స్ట్రీట్‌లోని ఫుడ్ స్టాల్స్‌లో వంటనూనె టీపీసీ రీడింగ్ నిబంధ నల ప్రకారం ఉండకపోవడంపై కేసు నమోదు చేశామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కచ్చితంగా పరిశుభ్రత పాటించాలన్నారు. తనిఖీల్లో జిల్లా ఆహార భద్రతా అధికారి వి.రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.


వంటశాలల్లో ఆయిల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

మస్కట్ రోడ్డు ప్రమాదంలో
నిడదవోలు యువకుడు మృతి

● స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం ● కంసాలిపాలెంలో విషాదఛాయలు


మస్కట్ నుంచి వచ్చిన మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో అవిటి రాజు (ఫైల్)

నిడదవోలు, సెప్టెంబరు 22: ఆ ఇంటి పెద్ద కొడుకుగా ఇంటి బాధ్యతలను భుజానికి ఎత్తుకుని తల్లిదండ్రులను తమ్ముడిని బాగా చూసుకోవాలనే తపనతో ఉపాధి కోసం మస్కట్ వెళ్లాడు. ఆ యువకుడు నేడో రేపో తిరిగి వస్తాడని ఆశతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు అక్కడ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెంది మృతదేహం ఇంటికి రావడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన అవిటి రాజు (24) సుమారు మూడేళ్ల క్రితం ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లాడు. తల్లిదండ్రులకు తమ్ముడికి అన్నీ తానై చూసుకొంటున్న అవిటి రాజు మస్కట్‌లో గతవారం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. రాజు మృతి చెంది వారంరోజులు అయినా అనారోగ్యంతో ఉన్న అతని తల్లి ఎక్కడ ఆందోళన చెందుతుందో అని బంధువులు గ్రామస్తులు తల్లిదండ్రులకు తమ్ముడికి తెలియకుండా ఉంచారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని చికిత్స పొందుతున్నాడంటూ శనివారం వారికి సూచాయగా చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున మస్కట్ నుంచి రాజు మృతదేహం బంధువులు గ్రామానికి చేర్చారు. తమ బిడ్డ లేడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ్ముడు బాధ వర్ణనాతీతం. నేడో రేపో తిరిగి వస్తాడని రాజుకు వివాహం చేయాలనే ఆలోచనలో ఉన్న కుటుంబానికి రాజు మృతదేహం రావడంతో వారి రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు సైతం రాజు మృతిపట్ల విషాదంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి


సంఘటనా స్థలంలో మృతి చెందిన గోవిందు

తునిరూరల్, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదంలో అన్నవరం దేవస్థానానికి చెందిన ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన ఎలుగు గోవిందు(26) అన్నవరం దేవస్థానంలో విధులు ముగించుకుని సైకిల్‌పై తేటగుంట గ్రామానికి వస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారి పాత ఆర్టీవో చెక్‌పోస్టువద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తుని రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోఉన్న సీసీ కెమెరాల పుటేజ్‌ను పోలీసులు పరిశీలించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తిస్తామని తునిరూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కృష్ణమాచార్య తెలిపారు.

దుర్వాసనను భరించలేకపోతున్నాం

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఎదుట స్థానికుల ఆందోళన
- పెట్రోల్ బాటిల్‌తో యువకుడి హల్‌చల్


అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ముందు ఆందోళన చేస్తున్న స్థానికులు

గోకవరం, సెప్టెంబరు 22: తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామ సమీపంలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామంటూ స్థానికులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. పరిశ్రమ ప్రధానగేటువద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్వాసనతో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర వుతున్నాయని, పెద్దపెద్ద శబ్దాలు వెలువడుతుండడంతో పిల్లలు నిద్రపోవడం లేదంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థ నీటిని ఏవిధంగా ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై కూడా యాజమాన్యం ప్రజలకు వివరించాలని పట్టుబట్టారు. ఈ విషయంలో రివర్స్ బోరింగ్ పద్ధతిని చేపడుతున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో అనేకమార్లు ఇదే విషయంపై యాజమాన్యాన్ని నిలదీసినప్పటికీ వారిలో ఏమాత్రం మార్పు రాలేదని ఆవేదన చెందారు. ఈక్రమంలో ఓ యువకుడు తమకు న్యాయం చేసే వరకు పరిశ్రమలో జరిగే కార్యకలాపాలను నిలిపివేయాలంటూ పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేయడంతో అక్కడ వాతావరణం మరింత వేడెక్కింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో చర్చించారు. యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. తమ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పరిశ్రమ ముందు భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని గుమ్మళ్ళదొడ్డి, బావాజీపేట, వెదురుపాక గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రంలోని 25జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పరిధిలో కొత్త ఇన్‌చార్జిలు నియమితులయ్యారు. కాకినాడ జిల్లా ఇన్‌చార్జిగా మేడ సురేష్, కోనసీమ జిల్లా ఇన్‌చార్జిగా జగత శ్రీనివాస్, రాజమహేంద్రవరం జిల్లా ఇన్‌చార్జిగా కొలనుకొండ శివాజీలను నియమించారు.

శెట్టిబలిజ సంఘం సమావేశం రసాభసా

● ఇరువర్గాలు .తోపులాట ....చెదరగొట్టిన పోలీసులు


సమావేశంలో ఇరువర్గాల తోపులాట దృశ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 22: రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశం ఆదివారం ఉద్రిక్తతల నడుమ రసాభసాగా ముగిసింది. మధ్యాహ్నం తాలూకా శెట్టిబలిజ సంఘ సమావేశం ప్రారంభమైంది. శెట్టిబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు ఎంపీ బోస్ సారథ్యంలో మాజీ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో ఎంపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతుండగా మంత్రి సుభాష్ వర్గానికి చెందిన శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు గతంలో ప్రకటించిన దొంగల శ్రీధర్ మద్దతు దారులు బోస్ ప్రసంగానికి అడ్డుతగిలారు. బోస్ గో బ్యాక్, బోస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ దశలో బోస్ వర్గీయులు పోటీగా నినాదాలు చేశారు. ఇరువర్గాలు తోపులాట జరిగే పరిస్థితి నెలకొంది. దీంతో డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది రంగ ప్రవేశం చేశారు. ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో ఇరువర్గాలు పరుగులు తీశారు. దీంతో సమావేశం నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీ బోసు ప్రకటించారు. ఎన్నికలను కొన్నిశక్తులు అడ్డుకుంటున్నాయని అన్నారు. శెట్టిబలిజ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా పనిచేసి రాజీనామా చేసిన నరాల ఏడుకొండలు అధ్యక్షుడిగా, పలివెల నాగరాజు కార్యదర్శిగా కొనసాగుతారని బోస్ ప్రకటించారు. శాంతియుత వాతావరణం ఏర్పడేవరకు కొనసాగుతారని తెలిపారు.

అందరి సమక్షంలోనే ఎన్నికయ్యాం

దొంగల శ్రీధర్ మాట్లాడుతూ ఇటీవల సంఘం సమావేశం ఏర్పాటుచేసి తాలూకా శెట్టిబలిజ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని అందులో అధ్యక్షుడిగా తనను, కార్యదర్శిగా కోట శ్రీనివాసరావుతోపాటు పార్టీలకతీతంగా కార్యవర్గం ఎన్నుకున్నారన్నారు. ఎంపీ బోస్ సంఘంలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టేకుమూడి సత్యనారాయణ, పలివెల నాగరాజు, కాలా సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

వరద నుంచి బయటపడ్డ
గండిపోశమ్మ అమ్మవారు


గండిపోశమ్మ అమ్మవారి విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

దేవీపట్నం, సెప్టెంబరు 22: గత మూడు నెలల నుంచి వరద నీటిలో ఉండిపోయిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం ఆదివారం బయటపడింది. అమ్మవారి ఆలయం శుభ్రం చేసేందుకు తలుపులు తెరవగా అమ్మవారి తలపై నాగుపాము నాట్యమాడి మాయమైనట్లు పూజారి తెలిపారు. ఆలయ అధికారులు అమ్మవారి ఆలయంలో బురదను తొలగించారు. అమ్మవారి విగ్రహాన్ని శుభ్రపరుస్తున్నారు. ప్రతీ ఏడాది వరద సమయంలో అమ్మవారి ఆలయం నెలలు తరబడి ముంపులోనే ఉండడంతో మైదాన ప్రాంతాల నుంచి దర్శనం కోసం వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పోశమ్మగండి ఆలయం వరద ముంపు బారిన పడకుండా ఆలయం నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాలకృష్ణ


పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్న వేణు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 22: వైసీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండలంలోని బొమ్మూరులో పార్టీ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి లడ్డూ తయారీ విషయంలో భక్తుల మనోభావాలపై చంద్రబాబు దారుణమైన నింద వేశారన్నారు. అదే విషయమై సీబీఐతో విచారణ చేయించాలన్నారు. నిల్వ ఉంచిన ఇసుకను దొంగలించిన టీడీపీ నేతలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై పలు విమర్శలు చేశారు. ఈ సందర్భంగా వేణుకు పార్టీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, గూడూరి శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 22 : గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని పిండాలరేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతుందని సమాచారం రావడంతో పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోదావరి నుంచి మృతదేహాన్ని బయటకు తీయించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. 60 నుంచి 65 సంవత్సరాలు ఉంటుందని, అతని ఒంటిపై సిమ్మెంటు రంగుపై తెలుపు నిలువు చారలు కలిగిన పొడుగు చేతుల చొక్కా ధరించి, గెడ్డం మాసి ఉందన్నారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు, సెల్ 9440796622కు సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు
- శ్రీప్రకాష్‌లో ఘనంగా ముగిసిన క్లస్టర్ లెవెల్ టీటీ పోటీలు


టీటీ పోటీల్లో గెలుపొందిన విజేతలు

పెద్దాపురం, సెప్టెంబరు 22: బాల్యం నుంచి క్రీడలపై మక్కువను పెంచుకోవాలని, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు పేర్కొన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న క్లస్టర్ లెవెల్ సీబీఎస్ఈ టేబుల్ టెన్నిస్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ముందుగా ఆయనకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ సాదరంగా ఆహ్వానం పలికారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ పెద్దాపురం పట్టణంలో క్లస్టర్ స్థాయిలో టీటీ పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్ణయించుకోవా లని, అలాగే క్రీడలపట్ల మక్కువను పెంచుకోవాలన్నారు. సాటిమేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. టీటీ ఇంటర్‌నేషనల్ కోచ్ సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించాలంటే అహర్నిశలూ సాధన చేయాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో టీటీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో తమ పాఠశాలలో జాతీయస్థాయిలో టీటీ పోటీలు కార్యక్రమానికి వేదిక అయ్యిందని గుర్తుచేసుకున్నారు. కాకినాడ టీటీ వైస్ ప్రెసిడెంట్ దంటు భాస్కర్ మాట్లాడుతూ క్రీడాకారులు అంతా చక్కని ప్రతిభను కనభరిచారని, గెలుపు, ఓటములు సర్వసాధారణమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్‌మూర్తి, రమణకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తలుపులమ్మా కరుణించమ్మా!

● లోవ ఆలయానికి రూ.3.64లక్షల ఆదాయం

తుని రూరల్, సెప్టెంబరు 22: తూర్పు కనుమల్లో కొలువై తలంపులమ్మగా మహిమలు విరాజిల్లుతున్న లోవ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. లోవకు కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వంట షెడ్‌లతోపాటు వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజే అమ్మవారిని 20వేల మంది భక్తులు దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.3.64లక్షలు సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ్‌రాజు తెలిపారు.

కాకినాడ

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 నుంచి డయల్ యువర్ కమిషనర్ తదుపరి 10 గంటల నుంచి 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై ఆగ్రహం

పిఠాపురంలో వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న విశ్వ హిందూపరిషత్, భజరంగదళ్ నాయకులు

పిఠాపురం, సెప్టెంబరు 22: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో తయారు చేసే లడ్డూల్లో కల్తీ నెయ్యి వినియోగంపై విశ్వ హిందూపరిషత్, భజరంగదళ్, హిందూసంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో ఆదివారం ఆందోళన నిర్వహించారు. రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. భజరంగదళ్, వీహెచ్‌పీ కాకినాడ జిల్లా కన్వీనర్లు వెంకటేశ్వరరావు, సురేంద్ర దత్త, దాట్ల రాజు మాట్లాడుతూ జంతు కళేబరాల కొవ్వు ద్వారా వచ్చే నూనెతో తయారు చేసిన నెయ్యిని తిరుమల లడ్డూల్లో వినియోగించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాలు దెబ్బతీశారని, దీని వల్ల భక్తులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. కల్తీ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించి కల్తీ జరగడానికి కారకులుగా గుర్తించినవారిని కఠినంగా శిక్షించాలన్నారు. లడ్డూ తయారీలో స్వచ్ఛమైన నెయ్యిని వినియోగించడంతో పాటు తిరుమల పవిత్రత కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో చెల్లుబోయిన సతీష్, కొండెంపూడి శివ, శివబాల, అంకిరెడ్డి గౌరీ, కందా దేవి, కిషోర్, గుబ్బల రామకృష్ణ, పవన్, దత్తకుమార్, చిత్రాడ పవన్‌శర్మ, నాగేశ్వరరావు, గాయత్రి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

'తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వైసీపీ'



కోర్పు సాయితేజ్

గండేపల్లి, సెప్టెంబరు 22: తిరుపతి లడ్డూను వైసీపీ హయాంలో అపవిత్రం చేశారని కాకినాడ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్ మండిపడ్డారు. ఆయన ఆదివారం ఈ విషయంపై మాట్లాడుతూ కమీషన్లకు కక్కుర్తితో వైసీపీ ప్రభుత్వం దేవుణ్ని కూడా వదల్లేదని, జంతు కొవ్వులను నెయ్యిగా వాడడం హిందువుల మనోభావాలను దెబ్బతీసినట్టు ఉందన్నారు. వైసీపీ నాయకులు చేసిన పని సిగ్గుచేటని, దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'ఎస్సీ వర్గీకరణపై తీర్పును పున:పరిశీలించాలి'

ఏలేశ్వరం, సెప్టెంబరు 22: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాలని మహాసేన రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం లింగంపర్తిలో ఎస్సీ వర్గీకరణపై సమావేశం జరిగింది. రాజేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ మధ్యకాలంలో తరచూ మాలలపై చేస్తున్న వ్యాఖ్య లు సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ తమ పోరాటానికి మద్దతివ్వాలని రా ష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలకు మెమోరాండం అందించాలని నిర్ణయించామన్నారు. అక్టోబర్ 12న కాకినాడ అంబేడ్కర్ భవనంలో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టవలసిన ఆందోళనపై చర్చిస్తామని, జిల్లాలో మాల సోదరులంతా హాజరుకావాలని కోరారు.

'బీజేపీ సభ్యత్వాలకు అనూహ్య స్పందన'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22: బీజేపీ సభ్యత్వాలకు అనూహ్య స్పందన లభిస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు కర్రి ధర్మరాజు, మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు చెప్పారు. మండలంలోని పీఎస్ పూడి గ్రామంలో ఆదివారం బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని బీజేపీ సభ్యత్వాల నమోదునుకు ప్రజలు భాగస్వామ్యం అవడం నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, ఊటా భాస్కరరావు, నానిపల్లి శ్రీనివాస్, దొడ్డిపట్ల సుబ్బరాజు, కొల్లు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 22: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు జగ్గంపేట శివారు రంగవల్లినగర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి గుండె లాంటి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడానికి కేంద్రంలో మోదీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుందని, తక్షణం ఆపాలని విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ర్యాలీకి ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, దేవి, అర్జును తదితరులు నాయకత్వం వహించారు.

'ఎమ్మెల్యే నానాజీని బర్తరఫ్ చేయాలి'

జగ్గంపేట, సెప్టెంబరు 22: ఆర్‌ఎంసీ ప్రొఫెసర్‌ను తిట్టిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జగ్గంపేటలో దళిత సంఘాలు నిరసన తెలిపారు. నానాజీపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్, బీఎస్పీ జగ్గంపేట ఇన్‌చార్జి జత్తుల నాగేశ్వరరావు, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లూరి సత్యానందం, అంబేడ్కర్ వాది నీలపల్ల అప్పారావు డిమాండ్ చేశారు.

ఎస్‌ఐ బదిలీ నిలిపివేయాలంటూ ధర్నా

పిఠాపురం, సెప్టెంబరు 22: పిఠాపురం ఎస్‌ఐ మురళీమోహన్ బదిలీ నిలిపివేయాలంటూ పోలీసుస్టేషన్ వద్ద న్యాయవాది కాలి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు పట్టణ ఎస్‌ఐగా వచ్చిన మురళీమోహన్ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారని, ఎన్నికల ప్రశాంత నిర్వహణలో ఆయన పాత్ర ఎనలేనిదని విజయకుమార్ అన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న పిఠాపురంలో లాఅండ్ ఆర్డర్ కాపాడేందుకు మురళీమోహన్ బదిలీ నిలిపివేసి ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో ఎస్‌ఐ మురళీమోహన్ చర్చలు జరిపి బదిలీలు సర్వసాధారణమని తెలపగా ఆందోళన విరమించారు.

సీపీఎం కార్మిక కార్యదర్శిగా విప్పర్తి

సామర్లకోట, సెప్టెంబరు 22: సామర్లకోట పట్టణ సీపీఎం కార్మిక కార్యదర్శిగా విప్పర్తి కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పట్టణ సీపీఎం కార్యాలయంలో సీపీఎం పట్టణశాఖ సమావేశం నిర్వహించినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు దువ్వా శేషబాబ్జీ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుకను పూర్తి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఎన్నికైన కార్మిక కార్యదర్శి విప్పర్తి కొండలరావును సమావేశం అభినందించింది. సీపీఎం నాయ కులు కె.ప్రసాదరావు, శ్రీనివాస్, సత్తిబాబు, సురేష్‌కుమార్, మహేష్, హరిబాబు ఉన్నారు.

ప్రాణాలు తీస్తున్న పశువులు!

నడిరోడ్డుపై తిష్టవేసి వాహనదారులను ఢీ కొడుతున్న వైనం

గతేడాది ముగ్గురు మృత్యువాత

ఈ ఏడాది ఇద్దరి అధికారులతో సహా పలువురికి గాయాలు

గో యజమానుల నిర్లక్ష్యమే కారణం



కరప బజారుసెంటర్‌లో రోడ్డుపై తిష్టవేసిన గోవులు, కరప ప్రధాన రహదారిపై వాహనదారులకు అడ్డుగా నిలబడిన గోవులు

కరప, సెప్టెంబరు 22: కొంతమంది గోవుల యజమానుల నిర్లక్ష్యం వల్ల అమాయక ప్రజల నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతుండగా, పలువురు తీవ్రంగా గాయపడుతున్నారు. గోవులను సాకలేక వాటిని బయటకు వదిలేస్తుండడంతో అవి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ ప్రయాణికులను ఢీకొడుతూ వారి ప్రాణాలను హరించేస్తున్నాయి. కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారిలో కరప మండలం పరిధిలో గోవులు ఢీకొనడం వల్ల గతేడాది ముగ్గురు మృత్యువాత పడగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. గోవులు అడ్డురావడంతో ఈ ఏడాది ఇద్దరు అధికారులు బైక్‌ల పైనుంచి పడి తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇంత జరుగుతున్నా గోవుల యజమానులు వాటిని కట్టడి చేయడం లేదు. ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధం కలిగిస్తున్న గోవులను నియంత్రించడంలో పోలీసుశాఖ విఫలమయ్యిందనే విమర్శలూ వ్యక్తమవుతున్నాయి.

కాకినాడ-రామచంద్రపురం ప్రధానరహదారి ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది. కరప మండలంలోని తొమ్మిది గ్రామాలను కలుపుతూ 15కిలోమీటర్లకు పైగా ఈ ప్రధానరహదారి విస్తరించి ఉంది. నడకుదురు నుంచి వేళంగి వరకు ఉన్న ఈ ప్రధాన రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో పశువులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. రోడ్ల పక్కన పడేసిన కుళ్లిన కాయగూరలు, గడ్డి, ఇతర వ్యర్థాలు తింటూ రాత్రిపగలు అనే తేడా లేకుండా అవి రోడ్లపైనే తిష్టవేస్తున్నాయి. ఈ పశువులు రోడ్లకు అడ్డంగా తిరుగుతూ, ఒకదానికొకటి పొడుచుకుంటూ వాహనచోదకులు, పాదచారులపై పడి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. గతేడాది మే 6వ తేదీ రాత్రి పెనుగుదురు గ్రామానికి చెందిన పెచ్చెట్టి రమేష్, షేక్ సుల్తాన్ సాహెబ్ కాకినాడ నుంచి బైక్‌పై వస్తుండగా నడకుదురు-గురజనాపల్లి సెంటర్లో ఒక ఎద్దు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు స్పాట్‌లోనే మృతిచెందారు. అదే ఏడాది జూలై 30వ తేదీన కరపలో ఒక పశువు ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న దున్నే సూరిబాబు అనే రోజు కూలీ మృత్యువాత పడ్డాడు. దీంతో అతడి కుటుంబం వీధిన పడింది. ఇటీవలె కరప గెస్ట్‌హౌస్ వద్ద బైక్‌పై వెళ్తున్న వీఆర్వో పలివెల ఏసుబాబును, నడకుదురు వద్ద మోటర్‌సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న ఏఎస్‌ఐ ప్రసన్నకుమార్‌ను, వేళంగిలో ఒక పాదచారిని పశువులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదాల్లో ఈ ముగ్గురూ తీవ్రంగా గాయపడి కొన్ని రోజులు మంచానికి పరిమితమయ్యారు. ఇవే గాక లెక్కకు రాని ఎంతోమంది రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల వల్ల అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రోడ్లపై తిరుగుతున్న గోవులను గోశాలలకు తరలించాలని, వాటిని బయటకు వదిలేసి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

పెద్దాపురం డీఎస్పీగా శ్రీహరిరాజు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన శ్రీహరిరాజు

పెద్దాపురం, సెప్టెంబరు 22: పెద్దాపురం డీఎస్పీగా డి.శ్రీహరిరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ డీఎస్పీగా పనిచేసిన కె.లతాకుమారి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని డీజీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకర్లతో డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డీఎస్పీని సీఐ క్రాంతికుమార్, ఎస్‌ఐ మౌనిక మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గండేపల్లి: పెద్దాపురం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీహరిరాజును జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్‌ఐ శివనాగబాబు కలిసి పుష్పగుచ్ఛమందజేశారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణస్వీకారం

ఏలేశ్వరం, సెప్టెంబరు 22: ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఆదివారం నియమించారు. ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరై కోచైర్మన్‌గా వాగు రాజేష్, వైస్ చైర్మన్‌గా జొన్నాడ వీరబాబుతో ప్రమాణస్వీకారం చేయించారు. వారిని కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ముఖద్వారం అయిన ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి శైలజ, ఎంపీడీవో శ్రీనివాస్, కమిషనర్ అనూషలక్ష్మీ, టీడీపీ పట్టణాధ్యక్షులు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, దేవకి రాంబాబు, గట్టిం వెంకటరమణ, రెడ్డి లోవరాజు ఉన్నారు.

యునైటెడ్ టీచర్స్ క్రికెట్ పోటీలు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 22: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యునైటెడ్ టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు ఈ పోటీలు జరిగాయి. గొల్లప్రోలు, పిఠాపురం జట్లు, కొత్తపల్లి, పిఠాపురం జట్లు మధ్య జరిగిన పోటీల్లో గొల్లప్రోలు, కొత్తపల్లి జట్లు విజేతలుగా నిలిచాయి. అనంతరం జరిగిన ఫైనల్ పోటీల్లో గొల్లప్రోలు జట్టు విజేతగా నిలిచింది. పోటీలను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి చక్రవర్తి ప్రారంభించగా, లీగ్ నిర్వాహకులుగా జిల్లా కార్యదర్శి సీహెచ్.సూరిబాబు, పాములయ్య, సీతారామరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో రుణమేళా

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాలతో ఆదివారం పీఎం స్వనిధికి సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రుణమేళా నిర్వహించారు. లబ్ధిదారులు రుణమేళాను వినియోగించుకున్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద, ఎస్‌బీఐ ఆర్‌ఎం దహోరి, ప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

'దురుద్దేశంతోనే ఆరోపణలు'

కిర్లంపూడి, సెప్టెంబరు 22: సీఎం చంద్రబాబు రాజకీయ దురుద్దేశంతోనే పవిత్రమైన తిరుమల లడ్డూను తమ నేత వైఎస్ జగన్ ప్రభుత్వంలో అపవిత్రం చేశారని ఆరోపిస్తున్నారని మాజీ మంత్రి, జగ్గంపేట వైసీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలో వీరవరంలో ఆదివారం విలేకరుల సమావేశంలో తోట మాట్లాడారు. రాజకీయ స్వార్థంతోనే పచ్చి అబద్ధాలు వల్లిస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతున్నారన్నారు.

'హెచ్ఐవీపై అవగాహన ఉండాలి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఛేంజెస్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ దాసరి దుర్గాభవానీ కోరారు. ఆదివారం పండూరులో ఎంపీటీసీ నందిపాటి వెంకటలక్ష్మి త్రిమూర్తులు ఆధ్వర్యంలో మీకోసం అవగాహన సమావేశం నిర్వహించారు. 10 ఆరోగ్య సూత్రాలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు గరగ శ్రీను, గుమ్మళ్ల సత్యానందం, ఉవలవల సూరన్నముత్తయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

కాకినాడ క్రైం, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాకినాడ ట్రాఫిక్ - 1 సీఐ ఎన్ రమేష్ వాహనదారులకు ఆదివారం అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్, మితిమీరిన వేగం మద్యం తాగి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలను ఆయన వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్-2 సిఐ డి.రామారావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా ఆపరేషన్‌లు అభినందనీయం

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి

కాకినాడ రూరల్, సెప్టెంబరు 22: కాకినాడ రూరల్ మండలం చీడిగలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పితాని అప్పన్న ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లిఅనంతలక్ష్మి, రూరల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త పిల్లి సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ఇటువంటి వైద్యశిబిరాల వల్ల పేదలు, వృద్ధులకు వైద్యసేవలు సులువుగా అందుతాయని, కంటి పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌లు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంచుతూ 100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. టీడీపీ, జనసేన నాయకులు నాగబాబు, శ్రీను, రాంబాబు, శాస్త్రి, రామకృష్ణ, శివ, మహేష్, చిన్నీ పాల్గొన్నారు.

కాకినాడ డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రూ.2,60,000తో చేపట్టిన పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, బాలికలకు సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు, వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జగన్నాధరావు, జనార్ధన్, సురేష్, రమణ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వస్త్ర సంచుల ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22: గొడారిగుంటలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ చిత్రంతో ముద్రించిన వస్త్ర సంచులను ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. రత్నప్రసాదరావును అభినందించారు. కార్యక్రమంలో శిరంగు శ్రీనివాసరావు పాండ్రంకి రాజు, గవర శ్రీరాములు, అడబాల సత్యనారాయణ, మాచవరపు సత్యనారాయణ ఉన్నారు.

పలుచోట్ల ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు



జగ్గంపేట మండలం మల్లిశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ



తొండంగి: బెండపూడిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న యనమల రాజేష్

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 22: మండలంలోని మల్లిశాల గ్రామంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించామన్నారు. రాబోయే రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఎమ్మెల్యేకు పలువురు వినతిపత్రాలు అందజేశారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మారిశెట్టి భద్రం, ఎస్‌వీఎస్ అప్పలరాజు, సర్వసిద్ది లక్ష్మణ్, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధ లక్ష్మణ,గంట ఫకీర్ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపిన తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. 2వ డివిజన్ సౌజన్యనగర్‌లో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో 1,2,3,47,48,49,50వ డివిజన్లకు సంబంధించి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలో వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎమ్మెల్యే వివరించారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గోపు వెంకటరమణ, కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు ఉన్నారు.

తొండంగి: బెండపూడి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేసి ప్రభుత్వ విజయాలను వివరించారు. సీనియర్ నేత కొయ్యా రామకేశవ, బెండపూడి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు, పాలచర్ల యర్రబ్బు, గోపి, బూసాల శ్రీనివాసరావు, వై.ధర్మరాజు, అరిగెల నర్సింహమూర్తి, ధర్మరాజు పాల్గొన్నారు. బెండపూడి, ఏ.కొత్తపల్లి గ్రామాల్లో కార్యక్రమం జరిగింది.

ఏలేశ్వరం: ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. యర్రవరంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ఇది మంచి ప్రభుత్వం పేరుతో వంద రోజులు చేసిన కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, బస్వా ప్రసాద్, పైరాల కనకారావు, కొల్ల శ్రీనివాస్, కూటమి శ్రేణులు తదితరులున్నారు.

అందరికీ ఆధ్యాత్మికత అవసరం : ఎమ్మెల్యే సత్యప్రభ



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22: ప్రతీ ఒక్కరికి ఆధ్యాత్మికత ఎంతో అవసరమని, మానసిక అశాంతి నుంచి బయట పడేందుకు ఆధ్యాత్మికత ఎంతో దోహద పడుతుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని పెదశంకర్లపూడి మెట్టిచింత గ్రామంలో వినాయక ఆలయాన్ని ఆమె సందర్శించి పూజలు చేశారు. వినాయక ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నదానలో పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. మెట్టిచింత గ్రామంలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వరుపుల రామకృష్ణ, సూర్నీడి సురేష్, జువ్విన తిరుపతిరావు, కందా వీరాస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ఉండూరు రైలు గేటు మూసివేత

సామర్లకోట, సెప్టెంబరు 22: సామర్లకోట నుంచి ఉండూరు వెళ్లే ప్రధాన రహదారిలో సామర్లకోట వాటర్ వర్క్స్ సమీపాన ఉన్న ఉండూరు రైలు గేట్ మరమ్మతులు, ట్రాక్ పనుల దృష్ట్యా ఈ నెల 23 ఉదయం 7 గంటల నుంచి ఈ నెల 30 రాత్రి 7 గంటల వరకూ మూసివేయనున్నట్టు సామర్లకోట సీనియర్ సెక్షన్ ఇంజనీరు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట నుంచి ఉండూరు, తదితర గ్రామాలకు వాహనాల యజమానులు కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ విగ్రహం ముందుగా ఉన్న ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి మీదుగా వెళ్లాలని సూచించారు.



విభాగాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సత్యదేవుడి ప్రసాద విభాగాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు

అన్నవరం, సెప్టెంబరు 22: అన్నవరం సత్యదేవుడి ఆలయంలో ప్రసాదం తయారీ విభాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు తదితరులు పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్యదేవుడి ప్రసాదం తయారీ విషయంలో రాజీపడబోమని, ఎప్పటికప్పుడు ల్యాబ్ పరీక్షల రిపోర్టు ద్వారా సంతృప్తి అనిపిస్తేనే వినియోగిస్తామని అన్నవరం ప్రసాదానికి ఇటీవలే ఫుడ్ సేఫ్టీ నుంచి ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తింపు వచ్చిందని వివరించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకై ఉద్యోగులు, భక్తులతో మమేకమై ఆరోపణలపై విచారణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు



ఉపాధ్యాయులను పరిచయం చేసుకుంటున్న నవీన్

జగ్గంపేట, సెప్టెంబరు 22: స్థానిక గుర్రంపాలెం రోడ్‌లో బాలాజీ రైస్ మిల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ఆదివారం యూటీఎఫ్ కాకినాడ జిల్లా కార్యదర్శి పరాల వీర వెంకట సత్య నారాయణ(పీవీ)మాస్టర్, ఎస్.వీరబాబు ఆధ్వర్యంలో టీచర్స్ ఒలింపిక్స్‌లో భాగంగా నియోజకస్థాయి ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా పోటీలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, రుచి హోటల్ నాగేంద్ర చౌదరి, మారిశెట్టి రాధా, దేవరపల్లి మూర్తి,దాపర్తి సీతారామయ్య ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలేశ్వరం, సెప్టెంబరు 22: పెద్దనాపల్లిలో ఆదివారం టీడీపీ నాయకుడు సుంకర సత్తిబాబు, వివేకానంద సేవాసమితి నేతృత్వంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహింగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. రాజమహేంద్రవరం గౌతమీ, జగ్గంపేట సాయి హాస్పటల్ డాక్టర్లు భాగ్యలక్ష్మీ, రఘు, రమ్య సుమారు 250 మందికి వైద్య, నేత్ర పరీక్షలు నిర్వహించి 40 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు, మందులు అందజేశారు. 35 మందిని ఆపరేషన్ నిమిత్తం గౌతమీ నేత్రాలయానికి పంపించారు. ప్రగడ ప్రయాగ మూర్తి, ఎస్‌కే మదీనా పాల్గొన్నారు.

కూచిపూడి శాస్త్రీయ సంగీత పరీక్షలు

సామర్లకోట, సెప్టెంబరు 22: ప్రాచీన కళాకేంద్రం ఛండీగర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ పరిధిలో స్థానిక భాష్యం విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం కూచిపూడి శాస్త్రీయ సంగీత పరీక్షలు నిర్వహించారు. కళాకేంద్రం నిర్వాహకులు బేటా సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పరీక్షలకు 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్ణాటక సంగీతానికి హైదరాబాద్‌కు చెందిన మధుసూదనరావు, కూచిపూడి నృత్యానికి దీప్తి సరోజిని చీఫ్ ఎగ్జామినర్లుగా వ్యవహరించారు.

అదుపు తప్పి బోల్తా పడిన వ్యాన్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 22: ప్రత్తిపాడు పాదాలమ్మ గుడి సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. కత్తిపూడి నుంచి రాజమండ్రి వెళ్తున్న మినీ వ్యాన్ టైరు పంక్చరై టైరు ఊడి అవతల రోడ్డు మార్గంలోని వ్యాన్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా మరిడమ్మతల్లి తీర్థం

తాళ్లరేవు, సెప్టెంబరు 22: కోరింగ పంచాయతీ సీతారామపురంలో గ్రామదేవత మరిడమ్మతల్లి తీర్థం ఆలయకమిటీ చైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మరిడమ్మతల్లికి భక్తులు పూ జలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మరిడమ్మతల్లిని గ్రామస్తులు వాయిద్యాలు, బాణసంచాలతో ఊరేగించారు. కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తును చేపట్టారు.

సామర్లకోటలో మహాన్నదానం

సామర్లకోట, సెప్టెంబరు 22: సామర్లకోట సంగీతరావుపేటలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని ఆదివారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు భారీ ఎత్తున మహాన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ హాజరయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిపి వడ్డించి ప్రారంభించారు. గణపతికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

గాడిమొగలో భారీ అన్నదానం

తాళ్లరేవు, సెప్టెంబరు 22: గాడిమొగ శ్రీలక్ష్మిగణపతి స్వామి ఆలయం వద్ద గ్రామపెద్దలు, ప్రజలు, దాతలు సహకారంతో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ప్రజలు, రిలయన్స్‌సైట్ కార్మికులు కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జ్యూట్ బ్యాగుల అందజేత

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22: కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌లో అఖిల భారత స్త్రీ సమాఖ్య సౌజన్యంతో ఓఎన్జీసీ సహకారంతో ఆదివారం జ్యూట్ బ్యాగులను సిబ్బందికి అందజేశారు. అఖిలభారత స్త్రీ సమాఖ్య తరఫున ఎం.భానుమతి, ఓఎన్జీసీ తరఫున అన్వర్, కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ పాల్గొన్నారు.